ఎప్పుడు ఎక్కడ ఎలా జరగాలో అలా ఈశ్వరుడు నిన్ను అనుగ్రహిస్తూ ఉంటాడు, సరిగ్గా కాలం వచ్చేటప్పటికి నీకు ఇచ్చేది ఏదో నీకు ఇచ్చేస్తాడు. ఒకవేళ నీవు మర్చిపోయావు అనుకో, ఆయన మర్చిపోడు. గాఢనిద్రలో మనం నిద్రపోతున్నప్పటికి మన నిద్రను చూసేవాడు ఒకడు ఉన్నాడు, అక్కడ నీకు ఏ సమస్యలు లేవు. ఆ గాఢనిద్రలో ఉన్నవాడు ఎక్కడికి పారిపోలేదు, వాడు జాగ్రదవస్థలో కూడా ఉన్నాడు. వాడిని పట్టుకోండి చాలు మీకు వచ్చిన పని పూర్తి అయిపోతుంది. మనం పైకి ఆడంబరంగా ఉన్నట్లు కనబడటం లేదు కాని లోపల మనస్సులో ఆడంబరంగా ఉన్నాము, అది వదిలించుకోండి అంటున్నారు భగవాన్.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 21-01-2005, మల్కిపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

షిరిడీ బాబా కొంతమందికి దత్తాత్రేయుడిగా దర్శనమిచ్చారు, కొంతమందికి ఆంజనేయ స్వామిగా దర్శనమిచ్చారు, కొంతమందికి రాముడిగా దర్శనమిచ్చారు, ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన సర్వదేవతాస్వరూపుడు. సాయిరామ్ మహాయోగి, ఆయన అనేకమందిని అనేక రకాలుగా అనుగ్రహించారు. వారిలో ఉన్న జిజ్ఞాసను పెంచారు, వారిలో ఏదైనా దుఃఖం ఉంటే తొలగించారు, బాబా కల్పతరువు, ఎవరు ఏది కోరుకొంటే వారికి అది ఇస్తారు. కర్తృత్వం పెట్టుకోకుండా మనం పనిచేయటం లేదు. మనం ఎంతసేపు ఏదో కాంక్షపెట్టుకొని, స్వార్థం పెట్టుకొని పనిచేస్తూ ఉంటాము. దీని వలన కర్మలు, కర్మలు చేస్తే జన్మలు వస్తాయి. ఇక్కడ ఇంతమంది కూర్చొన్నాము. ఇందులో ఒక మనిషికి ఇంకోమనిషికి పోలిక లేదు, ఒక మనస్థత్వానికి ఇంకో మనస్థత్వానికి పోలికలేదు. ఎవరి ప్రారబ్దం వారిది, ఎవరి అంతస్థు వారిది, ఎవరి ఆర్థికపరిస్థితి వారిది. రకరకాల జీవులు, రకరకాల కర్మలు. మనం ట్రైనులో ప్రయాణించేటప్పుడు కొత్తవారిని కలుసుకొంటూ ఉంటాము, వారితో కొద్దిసేపు మాట్లాడుతూ ఉంటాము, ఆ పరిచయాలు ఎంత నిజమో మన కుటుంబ సభ్యులతో మనకున్న సంబంధాలు కూడా అంతే నిజం. ట్రైనులో పరిచయాలు ఆ ట్రైను దిగిపోయిన తరువాత మర్చిపోతాము కాని కుటుంబ సభ్యులతో దీర్ఘకాలం ఉండటం వలన ఇది నిజం అని మనకు అనిపిస్తుంది కాని అది ఎంత నిజమో ఇది కూడా అంతే నిజము. ఊరికే పొడుగు, పొట్టి తేడా తప్ప అది ఎంత అసత్యమో ఇది కూడా అంతే అసత్యం. కొంతమంది జీవులు ఎలా ఉంటారు అంటే ప్రకృతి రీత్యా జరిగే పనులు కూడా మేమే చేస్తున్నాము అని చెపుతారు. సూర్యుడు ఉదయిం చటం కూడా మా వల్లనే అని చెపుతారు, మీరు గాలి పీల్చుకోవటం కూడా మావల్లే జరుగుతోంది అంటారు. ఇటువంటి అహంభావపూరితులు ఉంటారు. మనకి

99 పాళ్ళు అజ్ఞానం ఉంది, ఒక వంతు జ్ఞానం ఉంది. కాని మనం ఏమనుకొంటున్నాము అంటే 99 పైసాలు జ్ఞానం ఉంది, ఒక పైసా అజ్ఞానం ఉంది అనుకొంటున్నాము. ఇది దురదృష్టకరం. ఈ సువిశాలమైన ఖగోళంతోటి పోల్చుకొంటే మన శరీరం ఎంత, మన బతుకు ఎంత, మనకు ఉన్న తెలివి ఎంత? ఈశ్వరుడికి తెలియకుండా ఈ సృష్టిలో ఏ సంఘటన జరగటానికి అవకాశం లేదు, ఉన్నది ఆయన ఒక్కడే. ఆయనతో పాటు మనం కూడా ఉన్నాము అనుకోవటం వలననే ఈ దుఃఖం అంతా. ఉన్నది ఆయనే, మనం లేనేలేము అన్న సంగతి తెలిసేవరకు ప్రతీ జీవుడిని దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. మహిమల వలన ఆత్మజ్ఞానం రాదు. ఆత్మజ్ఞానం వస్తేనేగాని శాంతి లేదు, సుఖం లేదు. జన్మపరంపరలలో నుండి విడుదల పొందలేము. కొంతమంది ఏదో ఊహించుకొని దుఃఖపడుతూ ఉంటారు, భూకంపాల వలన గాలివానల వలన ఇలా ప్రకృతి రీత్యా దుఃఖం వస్తూ ఉంటుంది, దేహప్రారబ్ధాన్ని బట్టి దుఃఖం వస్తూ ఉంటుంది, ఈ దుఃఖత్రయంలో నుండి విడుదల పొందటం ఒక్క జ్ఞానికే సాధ్యం. తమోగుణం, రజోగుణం, సత్వగుణం ఇలా గుణాలతోటి అజ్ఞానం తయారవుతోంది, ఈ అజ్ఞానం పోవాలంటే ప్రకృతి గుణాలు నశించాలి అంటే వాడు తమోగుణంలోనుండి, రజోగుణంలోనుండి, సత్వగుణంలో నుండి విడుదల పొందాలి. మాయ బయట లేదు, లోపలే ఉంది. అది అజ్ఞానం రూపంలో ఉంది, గుణాల రూపంలో ఉంది. అందులోనుండి విడుదల పొందకుండా మనకు ఆత్మ సాక్షాత్కారం లేదు. లోపల గుణాలు ఉన్నాయి, మనం ఆ గుణాలను చూసుకొంటూ బయటకు వచ్చేస్తున్నాము. ఆ గుణాలను ప్రక్కకు నెట్టి ఇంకా లోపలకు వెళితే, హృదయం యొక్క లోయలలోనికి దిగితే అక్కడ ఈశ్వరుడు నీకు దొరుకుతాడు. మనం ఆ గుణాల దగ్గరే ఆగిపోతున్నాము. అలాకాదు ఇంకా లోపలకు వెళ్ళిపోవాలి. మనం కాని శరీరంతోటి, మనం కాని మనస్సుతోటి, మనం కాని గుణాలతోటి తాదాప్యం పొందుతున్నాము, అసత్యంతో తాదాప్యం పొందుతున్నాము. ఈ తాదాప్యంలో నుండి ఎంతకాలం అయితే విడుదలపొందలేమో అంత కాలం మనకు సత్య సాక్షాత్కారం లేదు, శాంతి లేదు, సుఖం లేదు, ఆనందం లేదు. ముందు రజోగుణంలో నుండి, తమోగుణంలోనుండి బయటకు రా. సత్వగుణం కూడా గుణమే కాని అది మోక్షానికి దారి చూపించి తప్పకొంటుంది. మనం తమోగుణంలో ఉండిపోతాము అనుకోండి రాబోయే జన్మలలో జంతువులుగా పుడతాము, రజోగుణంలో ఉండిపోతే మనుషులుగా, రాక్షసులుగా పుడతాము, సత్వగుణాన్ని బాగా పెంచుకొంటున్నారు అనుకోండి రాబోయే జన్మలో మీరు ఋషులు అయిపోతారు. మనలో ఏ గుణాలు ఉన్నాయో మనకి మనం పరిశీలన చేసుకోవాలి. బహుజన్మల కృషివలన, బహుజన్మల సాధన వలన మీలో సత్వగుణం

పెరుగుతుంది. సాత్విక బుద్ధి పెరుగుతూ ఉంటే మాయలో నుండి విడుదల పొందుతారు, బంధంలో నుండి మోక్షం లోనికి వస్తారు అని భగవంతుడు చెపుతున్నాడు. వ్యక్తుల పట్ల, విషయాల పట్ల కోరిక వద్దు, వాటి మీద ఏవగింపు వద్దు అని పరమాత్మ చెపుతున్నాడు. సర్వసాధారణంగా మనం కొన్ని విషయాల పట్ల కోరిక పెట్టుకొంటాము, కొన్ని విషయాల పట్ల ఏవగింపు పెట్టుకొంటాము. ఈ రెండింటి వలన మీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మీకు రజోగుణం పెరిగిపోతుంది. అందుచేత కోరిక వద్దు, ఏవగింపు వద్దు, బహుజాగ్రత్తగా ఉండండి. మనం ఎవరినైనా ఏదైనా విషయంలో ఆక్షేపిస్తే అదే మనకు తిరిగి వస్తుంది. భగవంతుడు మనకంటే కొన్ని కోట్ల రెట్లు తెలివైనవాడు. మనం ఏదైనా చెడ్డ మాట్లాడితే చెడ్డపని చేస్తే మనకు చెడు తలంపులు వస్తే వాటిని ఏ జన్మలో ఎక్కడ ఎలా అనుభవంలోనికి తీసుకొని వస్తాడో ఆయనకు తప్పించి మనకు తెలియదు, ఆయన సర్వజ్ఞుడు, సర్వసాక్షి, జీవుడు కర్మ చేయటానికే పనికి వస్తాడు, కర్మ ఫలదాత ఈశ్వరుడు. ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకో, కోరికలు తగ్గించుకో. నీకు కోపం వస్తుంది, చిరాకు వస్తుంది, ఆందోళన వస్తుంది, కోరికలు వస్తూ ఉంటాయి. కంగారు పడవద్దు. జన్మాంతర సంస్కారాన్ని బట్టి ఏదో చేస్తే ఏదో వచ్చింది అంతే గాని ఈ కోరికగాని, ఈ కోపంగాని ఇవి ఏమీ నీ స్వరూపం కాదు. అందుచేత వాటికూడా వెళ్లిపోవద్దు. కోరిక వచ్చినా, కోపం వచ్చినా, అసూయ వచ్చినా ఇది నేను కాదు అనుకోండి, వాటిని గుర్తించకండి, అవి మీరు కాదు అని మీకు గ్రహింపు అయితే అవి ఎలా వచ్చాయో అలాగే పోతాయి, మీరు కంగారుపడవద్దు. లోపల ఏముంటే దానిని బయటకు రానివ్వండి. ఏదో చేస్తే ఏదో వచ్చింది అది నేను కాదు అనుకోండి. చేసింది మనస్సు, అనుభవించేది మనస్సు. అది నేను కాదు, అది నా స్వరూపం కాదు అనుకొంటూ దానితో కలవకుండా ఉంటే వచ్చింది వచ్చినట్లే పోతుంది, ఈ రకంగా కూడా మాయను జయించవచ్చు. ఈ దేహాన్ని, ఇంద్రియాలను మనకు భగవంతుడు ఇచ్చాడు. వాటి సహాయంతో అమృతానుభవం పొందాలి. ఇంద్రియాలను నియమించుకొంటే, స్వాధీనంలో ఉంచుకొంటే అవి నీకు ఉపకారం చేస్తాయి. అందుచేత నీవు ఏమి చేయాలి అంటే నీవు ఇతరుల మీద ఆధారపడకుండా నీ దేహయాత్ర సక్రమంగా జరగటానికి నీ ఇంద్రియాలను, మనస్సును ఎంత వరకు ఉపయోగించుకోవాలో అంతవరకు ఉ పయోగించుకొంటూ, నువ్వు ప్రపంచంతోటి, విషయాలతోటి కూడా అంతవరకే సంబంధం పెట్టుకో. అంతకంటే అతిగా వెళ్లవద్దు, అతిగా వెళితే బంధింపబడతావు. నువ్వు అవసరాల కోసం సంపాదించుకొంటే పాపం రాదు, ఆశ కోసం సంపాదించుకొంటే పాపం వస్తుంది. ఆశను ఎవడు తీర్చగలడు, ఆశకోసం సంపాదన మొదలుపెడితే ఎన్ని పాపాలయినా చేస్తాము,

ఎన్ని దుర్మార్గాలయినా చేస్తాము. ఎందుచేతనంటే ఆశ మనచేత అన్నింటిని చేయిస్తుంది. ఆశకు అంతులేదు. సముద్రానికి అయినా ఎక్కడో ఒకచోట ఆవలి వడ్డు కనిపిస్తుంది కాని ఆశకు ఆవలి వడ్డు కనబడదు, ఆశను జయించటం చాలా కష్టం. భగవంతుడు మనకు కోటి రూపాయలు ఇచ్చాడు అనుకోండి. దానిని వందకోట్లు ఎలా చేయాలా అని చూస్తాము. వందకోట్లు ఇచ్చాడు అనుకోండి వెయ్యి కోట్లు ఎలా చెయ్యాలా అని చూస్తాము, ఇంక మనకు మతి ఉండదు, ఇంక మనం నిజాన్ని వదిలేస్తాము. నీకు మోక్షం కావాలా, నీకు నిజంగా శాంత చిత్తము కావాలా, భగవదనుభవం పొందాలి అని నీవు కోరుకొంటున్నావా అయితే నీ అవసరాలకు సరిపడ సంపాదించుకో, నీ దేహయాత్రకు ఇతరులమీద ఆధారపడవద్దు, పనియందు బాధ్యతగా ఉండు, పనిని విడిచిపెట్టవద్దు, భగవంతుడు నీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేసుకొంటూ మిగతా కాలంలో భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చేసుకో. ఒకవేళ భగవంతుడు నీ అవసరాలకు మించిన సంపాదన ఇచ్చాడు అనుకో దీనజనులకు కొంత ఉపయోగించు. నీకు సంవత్సరానికి 10 లక్షల రూపాయలు ఆదాయం వస్తోంది అనుకోండి కొన్ని లక్షలు మీ అవసరానికి ఉపయోగించుకొన్నా, కొన్ని లక్షలు బ్యాంకులో వేసుకొన్నా, కనీసం ఒక లక్ష తీసి ప్రక్కన పెట్టి దానిని దీనజనులకు ఉపయోగించండి. దానిని దశమభాగం అంటారు, దశమ భాగం దీన జనులకు ఉపయోగించండి అని పరమాత్మ చెపుతున్నాడు. ఉన్నవాడు నారాయణుడు ఒక్కడే, వాడే ఈ జీవకోటి కింద కనిపిస్తున్నాడు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, రెండవది లేనే లేదు. ఆ ఒక్కటే మనకు అనేకంగా కనిపిస్తోంది. అక్కడ నుండి సంసారం ప్రారంభమవుతోంది. ఒక్కటిలోనుండి దుఃఖం రాదు, భయంరాదు, ఏదీ రాదు. మనం అనేకంగా చూడటం వలన, రెండులో నుండే భయం, దుఃఖం, సంసారం అన్నీ వస్తున్నాయి.

ఈ ప్రపంచం అంతా భగవంతుడిలో నుండే వచ్చింది అంటున్నారు కదా భగవంతుడిలో నుండే ఈ ప్రపంచం అంతా వస్తే, ఈ ప్రపంచానికి కారణం భగవంతుడే అయితే భగవంతుడికి కారణం ఎవరండి అని కొంతమంది అడుగుతూ ఉంటారు. భగవంతుడికి కారణం ఉంటే ఆయన భగవంతుడు అవ్వడు. చనిపోయిన తరువాత ఏదో పొందుతాము అని మనందరము అనుకొంటున్నాము కాని ఇప్పుడు లేదు అనుకోండి, అది చనిపోయిన తరువాత వస్తుంది అనుకోండి అది సత్యం ఎలా అవుతుంది. ఒక కాలంలో ఉండి ఇంకో కాలంలో లేనిది, ఒక అవస్థలో ఉండి ఇంకో అవస్థలో లేనిది సత్యం కాదు. నువ్వు ఎటువంటి సుఖాన్ని, శాంతిని పొందాలి అంటే దేహం ఉంటే సుఖం, దేహం పోయిన తరువాత కూడా సుఖం, ప్రపంచం కనిపిస్తే ఆనందం, ప్రపంచం కనబడకపోయినా ఆనందమే

అటువంటి సుఖాన్ని, శాంతిని, ఆనందాన్ని ఇప్పడే ఇక్కడే మనం పొందాలి. ఒక భక్తుడు భగవాన్ గురించి తెలిసిన మాటలు కొన్ని, తెలియని మాటలు కొన్ని మళయాళంలో వ్రాసుకొని వచ్చి భగవాన్‌ను చూడమన్నాడు. భగవాన్ దానిని చూసి తిరిగి ఇచ్చేసారు. వాడు ఏమనుకొన్నాడు అంటే భగవాన్ చదివారు, దానిని అంగీకరించారు, ఇంక నాకు అదృష్టం పట్టింది అనుకొన్నాడు. మరుసటి రోజు కుంజు స్వామి ఆశ్రమానికి వచ్చారు. ఆ రచయిత కూడా ఆశ్రమంలోనే ఉన్నారు. నీవు వ్రాసిన పుస్తకం ఒకసారి ఇయ్యి నేను చదువుతాను అని తీసుకొన్నారు. అందులో కొన్ని సత్యాలు, కొన్ని అసత్యాలు ఉన్నాయి. అప్పడు కుంజుస్వామి భగవాన్‌తో ఆ వ్రాసినవాడు సరిగా వ్రాయలేదు, మీరు చదివారు అంటున్నారు, మీరు చదివినప్పడు ఇదంతా అసత్యం అని చెప్పాలి కదా అన్నారు. అప్పడు భగవాన్ ఏమన్నారు అంటే ఈ ప్రపంచం సత్యం ఏమిటి, ఆ పుస్తకంలో ఉన్నది సత్యం అవ్వటానికి అన్నారు. వాడు సత్యం వ్రాయలేదు అనటానికి ఈ ప్రపంచం సత్యమా అన్నారు, ఈ ఒక్కమాట చాలు. మన జీవితంలో ఏదో ఒక చిన్న మంచిపని చేస్తే జీవితం పొడుగునా అది వేసుకొని తిరుగుతూ ఉంటాము. భగవాన్ అరుణాచలేశ్వరుడితో ఏమన్నారు అంటే నా అంతట నేను రాలేదు, నువ్వు పిలిస్తేనే వచ్చాను, వచ్చిన తరువాత నావాటా నాకు ఇవ్వటానికి ఇంకా ఆలస్యం ఎందుకు? నువ్వు ఎలా ఇచ్చినా, నా వాటా నాకు ఇవ్వాలి. నన్ను తరింప జేయటం అనేది నీ తలవిధి అన్నారు, అది జన్మాంతర అనుబంధం, విడదీయలేని అనుబంధం, ఒకవేళ విడదీయటానికి ప్రయత్నం చేద్దామన్నా ఆ సంకెళ్ళు కనబడవు. నీ పిలుపు వినబడి ఇక్కడకు వచ్చాను, నాకు జ్ఞానం అనే బిక్షను ప్రసాదించు. అది నీవు నాకు ఇవ్వవలసిందే, అందులో ఒకవేళ నీకు కష్టం కలిగినా అది నీ తలరాత ఈ పని నీవు చేయవలసిందే అన్నారు భగవాన్. మీరు పెద్ద పెద్ద సాధనలు చేయలేకపోయినా, తపస్సులు చేయలేకపోయినా నేను జన్మరహితుడిని, కర్మరహితుడిని, చైతన్యస్వరూపుడిని అని మీకు ప్రోపర్‌గా అవగాహన అయినా మీరు దుఃఖంలో నుండి విడుదల పొందుతారు అని పరమాత్మ చెపుతున్నాడు. గాఢనిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి వచ్చాక నాకు బాగా నిద్ర పట్టింది అని చెపుతావు. నువ్వు నిద్రపోయిన మాట నిజమే. నువ్వు నిద్రపోతున్నప్పటికి నిద్రపోకుండా ఉండి ఒకడు నీ నిద్రను చూస్తున్నాడు, వాడు కాలరహితుడు, జన్మరహితుడు, రూపరహితుడు, నామరహితుడు, వాడే పురుషుడు. వాడిని పట్టుకో. పురుషుడు అంటే మనలాంటి వాడు కాదు. మనం మల్కిపురంలో ఉంటే పాలకొల్లులో ఉండము, పాలకొల్లులో ఉంటే మల్కిపురంలో ఉండము. కాని ఆయన అలాంటివాడు కాదు పూర్ణంగా ఉన్నవాడు. మనకు అమృతానుభవం కలిగే వరకు ఏవో సందేహాలు, ఏవో సంశయాలు, ఏదో క్షోభ, ఏదో తీరని అశాంతి, దుఃఖం ఏ

జన్మకు ఆ జన్మ నిన్ను వెంటాడుతూనే ఉంటాయి. మనకు ఎటువంటి సంఘటన ఎదురయ్యి నప్పటికి మనకు సంతోషం రాకూడదు, దుఃఖం రాకూడదు. ఏవిధమైన వికారం లేకుండా నిర్వికారంగా ఉండగలగాలి. ఏదో పనిచేయటం వలన ఏదో రావచ్చు కాని ఆత్మజ్ఞానం రాదు. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం అవసరం, ఈశ్వరుని దయ లేకుండా మనం ఆయనను పొందలేము. సంసారం అనేది మహావృక్షం. దీనిని నరకటం చాలా కష్టం. రాగద్వేషాలు, కామక్రోధములు, బంధువులు, స్నేహితులు, విరోధులు ఇవిఅన్నీ కూడా ఈ మహావృక్షానికి కాండాలు, రొబ్బలు, ఆకులు. ఏ జన్మకు ఆ జన్మ ఈ సంసారవృక్షం ఉంటుంది. దీనిని ఎవడు నరకగలడు అంటే వైరాగ్యమనే గొడ్డలి, జ్ఞానమనే గొడ్డలిని ఎవడైతే సంపాదించాడో వాడే ఈ మహావృక్షాన్ని నరకగలడుగాని మిగతావారికి సాధ్యం కాదు అని పరమాత్మ చెపుతున్నాడు. మనకు ఇష్టంలేని సంఘటన జరిగింది అనుకోండి, ఉద్రేక పడిపోతాము, దానిని బట్టి రజోగుణం వచ్చేస్తుంది. మనకు ఇష్టమైన సంఘటన జరిగింది అనుకోండి సంతోషం వచ్చేస్తుంది. అప్పుడు కూడా రజోగుణం వచ్చేస్తుంది. అందుకే నా మాయను ఎవడూ జయించలేడు అని భగవంతుడు చెప్పాడు. మనందేహంగా ఉంటున్నాము, మనస్సుగా ఉంటున్నాము, కాని ఆత్మగా ఉండలేకపోతున్నాము. ఆత్మగా ఉండగలిగినవాడికే ఆత్మానుభవం కలుగుతుంది. జీవుడు వెళ్ళి ఆత్మను తెలుసుకోలేడు, మన తెలివితేటలతో ఆత్మను తెలుసుకోలేము, మనస్సుతో తెలుసుకొనేది కాదు. నువ్వు ఆత్మగా ఉండగలిగితే అదే నీకు ఎరుక పడుతుంది. మీరు అనుకొన్నది నెరవేరదు కాని ఈశ్వర సంకల్పం జరిగి తీరుతుంది. ఇప్పుడు మనకు ఏదైనా పదవి వచ్చింది అనుకోండి అది మన తెలివితేటల వలన కాదు, ఆయన అనుకోవటం వలన వచ్చింది. ఎవడైతే బ్రహ్మానుభవం పొందాలి అనుకొంటున్నాడో, ఎవడైతే సత్యాన్వేషణ చేస్తున్నాడో వాడికి గౌరవాలు విషంతోటి సమానము, అగౌరవం అమృతంతో సమానము. ఇతరులు మిమ్మల్ని గౌరవించరు అనుకోండి శుభ్రంగా మీ మనస్సు లోపలకు వెళ్ళిపోతుంది. వారు గౌరవిస్తారు అనుకోండి అందరూ గౌరవిస్తున్నారు అని మీ మనస్సు విజృంభిస్తూ ఉంటుంది. మీకు సన్మానాలు చేస్తూ ఉంటే మీకు రజోగుణం పెరిగిపోతూ ఉంటుంది. నన్ను ఎవరు గౌరవిస్తారు? నన్ను ఎవరు సన్మానిస్తారు? నన్ను ఎవరు ఊరేగిస్తారు అని చూసేవాడికి ఆత్మజ్ఞానం ఏమిటి? మీ ఇంట్లోనివారు మిమ్మల్ని అవమానం చేస్తున్నారు అనుకోండి, మీరు నిజంగా సత్యాన్వేషకులయితే అది మీకు వరం, ఎందుచేతనంటే వారి మీద మీకు మమకారం పోతుంది. అందుచేత అది వరం. దేహాభిమానం ఉన్నంతకాలం మనస్సు చలిస్తూనే ఉంటుంది. దానికి టెంపరరీ డోస్ ఏమిటి అంటే భగవంతుడి నామాన్ని స్మరించుకోవటం, ఆయన రూపాన్ని ధ్యానించుకోవటం వలన

మనస్సు నశించకపోయినా మనస్సు అణిగి ఉంటుంది. మనస్సు అణిగి ఉండటం వలన కొంత శాంతిగా ఉంటుంది. కాని మనో నాశనం అయితేనేగాని అమృతానుభవం కలుగదు. నువ్వు ఏదైనా విషయం గురించి ఆలోచిస్తున్నావు అనుకో, అది లోతుగా ఉండాలి, నీ చూపు దీర్ఘంగా ఉండాలి. నువ్వు ఎవరికైనా సలహా చెబితే అది ఊరికే ఆ రోజు గడిచిపోయేలా చెప్పకు, శాశ్వతంగా వారికి ఉపయోగపడే లాగ చెప్పు. మనం రాముడిని, కృష్ణుడిని ఆరాధిస్తాము కాని కొంతమంది భగవంతుడి రూపాన్ని ఆరాధించరు, ఆయన చెప్పిన వాక్యాలను ఆరాధిస్తారు. ఆ వాక్యాలను ధ్యానం చేసి, వాటి అర్థాన్ని జుర్రుకొని, దానిని అనుభవించి, విచారణ చేసి అమృతానుభవం పొందుతారు. నీకు ఏవో కోరికలు వస్తున్నాయి అంటున్నావు, అశాంతి వస్తోంది అంటున్నావు అంటే నీవు సత్యంలో లేవని అర్థం. నీవు అబద్ధంలో ఉన్నప్పుడు అశాంతి వస్తుంది కాని సత్యంలో ఉన్నవాడికి అశాంతి రాదు. ఇప్పుడు నీవు ఏ స్థితిలో ఉన్నావో అది సహజస్థితి కాదు. ఇప్పుడు మనం నార్మల్‌గా లేము, సహజంగా లేము, మనం అసహజంగా ఉన్నాము. అజ్ఞానాన్ని జ్ఞానం అనుకొంటున్నాము, అసత్యాన్ని సత్యం అనుకొంటున్నాము. నువ్వు అసహజస్థితిలో ఉన్నావు కాబట్టే సతమతమయి పోతున్నావు, అశాంతి వస్తోంది. యజ్ఞాలు, యాగాలు, జపాలు, ధ్యానాలు చేసి దేనినైతే పొందుదామని అనుకొంటున్నావో అది నీవై ఉన్నావు. నీవు ఏదిగా ఉన్నావో, నీవు అలాగ ఉండగలిగితే లోపల ఉన్న ఆనందం పొంగివచ్చి నీ సహస్రారాన్ని ముంచుతుంది. జ్ఞాని సమక్షంలో, సహృదయం ఉన్న వారి సమక్షంలో నీవు పొందే శాంతి, సుఖాల ముందు స్వర్గ సుఖాలు కూడా తీసికట్టు అని వశిష్ఠుడు చెప్పారు. ఎక్కడో బ్రహ్మానుభవం దాకా వెళ్ళనక్కరలేదు, సత్పురుషులు, సహృదయం ఉన్న వారి సమక్షంలో నువ్వు ఆనందంలో ఊగిసలాడతావు. సాధకుడికి గౌరవాలు కూడా రోత. మిమ్మల్ని ఎవరైనా అగౌరవ పరిచారు అనుకోండి మీరు బాధపడిపోతారు. అగౌరవం అనేది సాధకుడి యొక్క అహంకారానికి కోత. చనిపోవటాలు, పుట్టటాలు ఇవి అన్నీ దేహానికి సంబంధించినవి. ఇందులో ఏమీ లేదు. ఏ వస్తువు అయితే అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఉందో దాని స్వరూపం జ్ఞానం, దాని స్వరూపం ఉండటం, దానిని పొందటం మానివేసి చనిపోతున్నాను, పుడుతున్నాను అంటావు ఏమిటి? ఇందులో ఏముంది, ఇదంతా డొల్ల, నీ హృదయంలో ఉన్న సత్యవస్తువును పొందటం మీదే నీ దృష్టిని కేంద్రీకరించు, నీ మనస్సును అక్కడ పెట్టు, పొందవలసింది ఏదో పొందటానికి ప్రయత్నంచెయ్యి.

దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఒకోసారి దుఃఖం వస్తుంది, ఒకోసారి సంతోషం వస్తుంది. కొంత మంది మిమ్మల్ని పొగుడుతారు, కొంతమంది విమర్శిస్తూ ఉంటారు, ఈ గొడవలు

నీకెందుకు. బ్రహ్మానుభవం పొందటానికి ప్రయత్నం చెయ్యి, బ్రహ్మంలో ఐక్యమవ్వటానికి ప్రయత్నించు. నేను అది సాధించాను, ఇది సాధించాను అని ఎంతసేపు మనస్సు గొడవ, దేహం గొడవలో ఉండవద్దు, ఇదే పునర్జన్మకు కారణం. దేవుడు ఇచ్చాడా లేకపోతే నువ్వు సాధించావా? అసలు నువ్వంటూ ఒకడవు ఉన్నావా? భగవాన్ ఏమంటారు అంటే నేను కర్తను, నేను కర్తను అంటున్నావు దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు మిగతా విషయాలు మాట్లాడుకొందాము అంటారు. ఒక మహాజ్ఞాని దగ్గరకు వెళ్లేటప్పుడు మన బుర్రలోని గొడవలు అన్నీ ఒక ప్రక్కన పెట్టుకొని వెళ్ళాలి. పరమాత్మ ఏమి చెపుతున్నాడు అంటే నేను ఈ లోకాలను నడిపే లోకేశ్వరుడను, జన్మరహితుడను, కారణరహితుడను, రూపరహితుడను, నామరహితుడను అన్న విషయం మీకు అర్థమయినా, ఆ క్లూ మీకు అర్థమయినా అమృతానుభవం ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. మన పొగరుబోతుతనం ఆవాక్యాన్ని అర్థంచేసుకోనివ్వటం లేదు. మీరు గీతలో శ్లోకాలు ఎన్నిసార్లు చదివినా, ఒక జన్మలో కాదు వంద జన్మలు చదివినా మీకు అర్థం కాదు. వైరాగ్యం లేనివాడికి శాస్త్రం చదివినా అర్థం కాదు. వైరాగ్యం ఉంటేనే అది అర్థమవుతుంది. వైరాగ్యం ఉన్నవాడు మాత్రమే పనిని పెర్ఫెక్టుగా, బాధ్యతగా, సంతృప్తిగా చేయగలడు. ఇప్పుడు మనలో ఉన్న రెండు పెద్ద లోపాలు ఏమిటి అంటే మనకు పని అంటే ఇష్టం ఉండదు, చేసిన పని మీద బాధ్యత ఎవరూ పెట్టుకోరు. మనం చెయ్యవలసిన పని మానివేస్తే దోషం వస్తుంది, చెయ్యకూడని పని చేస్తే కూడా దోషం వస్తుంది. ఈ పని చెయ్యండి, ఈ పని చెయ్యవద్దు అని భగవంతుడు వివరంగా చెప్పాడు కాని కొంతమంది సబ్జక్టును కలగాపులగం చేసేస్తున్నారు అని ఒక స్వామీజీతో అంటే వారి గొడవ ఎందుకు వారు ఎలా వచ్చారో అలాగే పోతారు. ఉన్నదేదో సబ్జక్టు మన ఎదురుగా ఉంది, దానిని ఆస్వాదించండి, తరించండి అంటున్నారు స్వాములవారు. నీవు మాట్లాడే మాట, నీవు చేసేపని నీకు చిత్తశుద్ధిని కలుగజేయాలి. నిష్కామకర్మ చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. కామ్యకర్మలు దేహాభిమానాన్ని పెంచుతాయి, మల దోషాన్ని పెంచుతాయి. దీని వలన శవబుద్ధి పెరిగిపోతుంది. శరీరం ముసలిది అయిపోతోంది, ఈ శరీరం చనిపోతుందేమో అని ఇలా కంగారుపడవద్దు. ఏమిటి ఈ గోల ఈ శరీరం కాకపోతే ఇంకో శరీరం వస్తుంది. అసలు పరమపురుషుడిని, ఆ పూర్ణంగా ఉన్న వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. శరీరం ముసలిది అవ్వకుండా ఎంతకాలం ఉంటుంది, అది ప్రకృతి సహజం. సహజం అయిన దానికి ఉద్రేకం ఎందుకు? దాని కోసం ఉద్రేకపడవద్దు. అసలు పొందవలసింది పొందలేక పోతున్నాము ఏమిటి అని దానికోసం తపించండి, దానిని పొందటానికి ప్రయత్నించండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 08-03-05 | మంగళ | చించినాడ (శివరాత్రి) |
| 13-03-05 | ఆది | పత్తేపురం |
| 20-03-05 | ఆది | జిన్నూరు, శ్రీరమణ క్షేత్రం |
| 24-03-05 | గురు | చించినాడ |
| 25-03-05 | శుక్ర | అమలాపురం, టి.టి.డి. కళ్యాణ మండపం (సా॥ గం॥ 4లకు) |

# ఉపాధిని సున్నా చేస్తే – ఉన్నది ఆత్మే


"నేను" శరీరమాత్రుడను అనే భ్రమే ఒక మనోవృత్తిగా మారి, ఆందోళన ప్రారంభమౌతుంది. ఈ శరీర తాదాప్య బుద్ధి తో శరీరం లోని అన్ని అవస్థలు తనవిగా భావించి, అందుండి "నాది" అనే మమత్వభావం ఉదయిస్తుంది. శరీరానికి సుఖాన్ని ఇచ్చేవన్ని తనకు కావాలని వాటిని పొందటంలో కష్ట-సుఖాలు అనుభవించటం జరుగుతుంది. ఈ భ్రాంతి మూలంగా నిష్పక్షపాతంగా వ్యవహరించలేక పోతాము. శారీరక సుఖాలను ఇచ్చే వస్తుసంపద విలువైనదిగా భావించే వ్యక్తి, వాటిని సొంతం చేసుకునే ప్రయత్నంలో పొందే బాధలే సంసారంగా, పేర్కొనబడుతుంది. సాధకుడు "శ్రద్ధ" తో ఇవి అన్నీ శాశ్వత సుఖసంపదలు కావని గెంటుకుపోతే మూలంలో ఉన్న సుఖస్వరూపం అనుభవమౌతుంది. ఏ వెలుగుతో ఇవి అన్ని వాటి ఉనికిని నిలబెట్టుకొంటున్నాయో ఆ వెలుగు తెలుస్తుంది. మార్పుచెంది, నశించే దుఃఖకరమైన ఉపాదులను సున్నా చేస్తే, మారనిది శాశ్వత ఆనంద ప్రదమైన ఆత్మలో నిలకడచెంది కృతార్థులు కావాలి అంత వరకూ ఈ ప్రకృతి పాఠాలు నేర్చుకుంటూ జనన-మరణాలు అనే పరీక్షలకు హాజరుకాక తప్పదు. ఈ భ్రాంతులను సున్నా చేసే ప్రేమ గురువు మనకు మార్గదర్శి కావాలి, వారు చూపిన బాటలో మనం నడవాలి. అజ్ఞాన రోగంతో భాదింపబడుతూ, అనేక వృత్తులతో కూడియున్నట్టి మనస్సు, అనేక ఆకారాలను చెందుతూ, భుజిస్తు, సంచరిస్తు, విజృంభిస్తున్నది, నిందించుచున్నది. ఇంట్లో అన్ని వ్యవహారాలు యజమాని చూసుకొంటాడు గృహంచూసుకోదు. అన్ని కల్పనలకు మనస్సే కర్త-భోక్త శరీరం కాదు. ఇన్ని మాటలు దేనికి ప్రతీ వ్యక్తి నిదురలో శరీరానికి సంభందించిన, అన్ని ఉపాదులను మర్చిపోతున్నాడు, సైన్యాధిపతి వెంట భటులు అంతా తోక ముడిచి పారిపోతున్నారు-ఇక యుద్ధం ఎక్కడ? భయభ్రాంతులు ఎక్కడ? అంతా సుఖమే ఇది మన నిత్య అనుభవమే కాని ఇది మన ప్రమేయంతో జరగటంలేదు. "ఎచట నుండి వచ్చునెచటకిదా పోవు; నిద్ర చంద్ర మెఱుక నేర్చినేని; అచలమైన వ్యక్తి నచటనుండు" అన్నారు వేమన. "నువ్వుల నుండి వేరుచేసిన నూనె నువ్వులతో సంభందం లేకుండా ఉన్నట్లే, జ్ఞాని, దేహేంద్రియ, మనసాదులతో సంభందం లేకుండా కేవలం చైతన్యంగా ఉంటాడు" అంటోంది యోగవాసిష్ఠము. జ్ఞానిని తిట్టినా, కొట్టినా, తిరిగి మాట్లాడక అటు ఇటూ చూడక, అదిరి పడక తన్నుకానట్లు ఉంటాడు. ప్రపంచంలో ఉంటూ నిష్ప్రపంచస్థితిలో ఉండటమే మన సాధన.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం



పాలకోడేరు సభలో సద్గురు శ్రీ నాన్నగారు మరియు
డి.ఎస్.పి. శ్రీ ఆర్. శివరామరాజుగారు

## అభాస జ్ఞానం - సత్య జ్ఞానం



మనస్సు కల్పించిన వైచిత్ర్యమంతా నీకు తెలియబడుతున్నదంటే ఒక వెలుగు దానినంతనూ ప్రకాశింప జేస్తున్నదని నీవంగీకరించి తీరాలి. ఈ భావసముదాయం గాఢనిద్రలో అంతర్ధానమై మెలకువలో తిరిగి తల యెత్తుతున్నది. కనుక ఈ వెలుగు అనిత్యమని చెప్పాలి. దీనికి ఆద్యంతములున్నాయి. స్వతంత్ర సత్తా లేదు. అందుచే నిది అభాస జ్ఞానం. అహంస్ఫురణ ఒక్కటే నిత్యం, అవిచ్ఛిన్నం. ఇది హృదయ స్థానంలో స్ఫురిస్తూ ఉంటుంది. నిద్ర నుంచి మేల్కను నప్పుడది మెదడులో ప్రతిఫలించి అటు పిమ్మట శరీరమంతా వ్యాపిస్తుంది.

**- భగవాన్ శ్రీ రమణ మహర్షి**